క్లుప్తంగా

గ్రామ సింహాల ఏరివేత



కుక్కలను వలవేసి పట్టుకుంటున్న ప్రజారోగ్యశాఖ సిబ్బంది

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడి ప్రాంతంలోని శ్రీనివాస నగర్‌లో గ్రామసింహాల ఏరివేత చేపట్టారు. కాలనీలో కుక్కలు గుంపులుగా తిరుగుతూ ఉండడంతో స్థానికులు హడలిపోతున్నారు. చిన్నారులను ఒంటరిగా బయటికి పంపాలన్నా కలవరపడుతున్నారు. పైగా ఎవరైనా కొత్తవారు వస్తే కలియబడి, గాయపరుస్తుండటంతో భయందోళనలకు గురవుతున్నారు. దీంతో వార్డు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనక భవాని ఫిర్యాదు మేరకు స్పందించిన ప్రజారోగ్యశాఖ అధికారులు కుక్కల ఏరివేత చర్యలు చేపట్టారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేత్రపర్వం.. దుర్గమాంబ అనుపు మహోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి, గ్రామ కమిటీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు చుక్కవాని పాలెం గ్రామ దేవత దుర్గమాంబ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, గ్రామ కమిటీ నాయకులు దర్శించుకుని, విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ నాయకులు చుక్కా పోలి రెడ్డి, నక్కా ప్రకాశ్ రెడ్డి, ఉపేంద్ర, గొందేశి వెంకటరమణా రెడ్డి, చుక్కా పైడి రెడ్డి, శేఖర్, పలువురు యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తమ్మ తల్లి జాతర



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి గ్రామ దేవత కొత్తమ్మ వారి జాతరను మంగళవారం ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా కణితి, వడ్లపూడి నిర్వాసిత కాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు విజయరామరాజు, ప్రగడ వేణుబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు సూరిశెట్టి పెంటారావు, ప్రగడ శ్రీను, బొడ్డ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ వెల్‌నెస్ సెంటర్‌కు ఈవోఐ విడుదల



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఉక్కు స్టేడియం ఆవరణలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌కు ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)కు దరఖాస్తులు ఆహ్వానిస్తూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది. సుమారు 5 వేల చదరపు అడుగులు కలిగిన ఆర్‌సీసీ బిల్డింగ్ ప్రాంగణాన్ని 10 ఏళ్ల పాటు అద్దెకు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను జూలై 6 వరకు స్టీల్‌ప్లాంట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. దరఖాస్తుకు జూలై 13ను ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఆసక్తి గల వ్యక్తులు, పార్టీలు గడువు వ్యవధిలోగా తమ దరఖాస్తులు అందజేయాలని తెలియజేశారు.

ధరల మంట



కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

- చుక్కలను తాకుతున్న కూరగాయల ధరలు
- మూడు వారాల్లో ఎంతో మార్పు
- మోతెక్కిస్తున్న టమాటా..
- అదే బాటలో ఉల్లి, క్యాప్సికం
- హడలిపోతున్న వినియోగదారులు

పెదగంట్యాడ: కూరగాయల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ధరలు ఒక్కసారిగా పెరగడంతో కూరగాయలు కొనాలంటేనే వినియోగదారులు హడలిపోతున్నారు. ఎండలకు కూరగాయల దిగుబడి బాగా తగ్గడం, నీరు లేక పంటలు దెబ్బతినడంతో వాటి సరఫరా తగ్గిందని విక్రయదారులు చెబుతున్నారు. అన్ని కూరగాయల ధరలు కిలోకు రూ.25 నుంచి రూ.35 వరకు పెరిగాయి. ముఖ్యంగా టమాటా, ఉల్లి, పచ్చిమిర్చి, క్యాప్సికం ధరలు మరీ దారుణంగా ఉన్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

ధరలు రెట్టింపు

కూరగాయల ధరలు ముఖ్యంగా ఉల్లి, టమాటా ధరలపై వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. నిన్న మొన్నటి వరకు కిలో రూ.25 నుంచి రూ.30 వరకు ఉన్న కిలో ఉల్లి ప్రస్తుతం రూ.45 నుంచి 50కు చేరుకుంది. మూడు వారాల క్రితం వరకు టమాటా కిలో రూ.50 ఉంటే ప్రస్తుతం రూ.100 నుంచి 120 దాటేసింది. అలాగే క్యాప్సికం మొన్నటి వరకు రూ.50 ఉండేది. ఇప్పుడు రూ.100 కి చేరుకుంది.

పచ్చిమిర్చిది కూడా అదే బాట.. గతంలో కిలో పచ్చిమిర్చి ధర రూ.30 నుంచి 40 ఉంటే ఇప్పుడు దాదాపు రెట్టింపు అంటే రూ.80కి పెరిగింది. ఇక బంగాళా దుంపలు, దొండకాయలు, ములక్కాడలు, ఆనపకాయలు తదితర కూరగాయలు రకాలపై రూ. 20 నుంచి 30 వరకూ పెరుగుదల కనిపిస్తోంది. ప్రధానంగా ఈ రెండు, మూడు వారాలుగా ధరలు అమాంతం పెరిగిపోయాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి వల్లే..

గతంలో దుకాణానికి సంచి పట్టుకుని వెళితే రూ.200 కు సుమారు వారం రోజులకు సరిపడా కూరగాయలు కొనుగోలు చేసుకునేవారు. ఇప్పుడు పెరిగిన ధరలతో 300 నుంచి 500 రూపాయలు

ధరలు ఇలా..

కూరగాయలు	రైతుబజారు ధర (రూ.)	మార్కెట్ ధర (రూ.)
ఉల్లిపాయలు	37	50
టమాటా	67	100
వంకాయలు	50	65
బెండకాయలు	48	70
పచ్చిమిర్చి	62	90
బంగాళాదుంపలు	33	50
క్యాప్సికం	84	120
క్యారెట్	40	80
దొండకాయలు	40	60



రైతుబజారులో కూరగాయల కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

వెచ్చిస్తేనే గాని సంచి నిండడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. కూరగాయలకు ఇతర రాష్ట్రాలపై ఆధారపడడం, అక్కడి ధరల పెంపు ప్రభావం సామాన్యులపై పడింది. లోకల్‌గా పండించే కూరగాయలు మార్కెట్లోకి వచ్చేవరకూ ఈ పరిస్థితి తప్పదని వ్యాపారులు చెబుతున్నారు.

కూరగాయలు కొనాలంటే భయం



ధరలు బాగా పెరగడంతో కూరగాయల మార్కెట్‌కు వెళ్లాలన్నా భయం వేస్తుంది. గత నెలకు, ఇప్పటికీ ఎంతో తేడా కనిపిస్తోంది. కిలో దగ్గర అరకిలో తెచ్చుకోవడం, ఒక్కోరోజు ఆకుకూరలతో సరిపెట్టుకోవడం అలా చేస్తున్నాం. ధరలు తగ్గించేలా చూడాలి.

– ఎస్. మణి, పెదగంట్యాడ

ఈ ధరలతో ఏం కొంటాం?



మార్కెట్‌లో టమాటా ధర విని షాక్ అయ్యాను. కేజీ రూ.100 చెప్పారు. ఇలా అయితే ఏం తింటాం అనిపించింది? నేను వెల్డింగ్ పనులు చేస్తా. రోజుకు 500 వరకూ సంపాదిస్తాను. దానితోనే కుటుంబాన్ని నెట్టుకురావాలి. ఒక్కసారిగా ధరలు ఇలా పెరిగిపోతే ఏం కొంటాం? ధరల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.భానుశంకర్, నెల్లిముక్కు

వైకుంఠ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



హారతి ఇస్తున్న అర్చకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామికి మంగళవారం పంచామృతాభిషేకాలు చేశారు. స్వామి వారి జన్మతార శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, దాతలు మిత్తని అప్పలరెడ్డి, పెంటకోట నాగేశ్వరరావు, అప్పల సూరి, సుబ్బరాజు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తత అవసరం

పెదగంట్యాడ: వాతావరణంలో మార్పులతో పాటు వర్షాలు పడుతున్న నేపథ్యంలో వైరల్ జ్వరాలు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, జీవీఎంసీ జోన్-6 జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు సూచించారు. డెంగ్యూ, మలేరియాపై జ్వరాలపై 76వ వార్డు పరిధి నడుపూరులో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు సంక్రమిస్తాయన్నారు. పరిశుభ్రత పాటించడం, నీరు నిల్వ లేకుండా చూడటం తదితర జాగ్రత్తలు పాటించడం ద్వారా జ్వరాలను నివారించవచ్చన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అతిసారం ప్రబలే



అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, జెడ్సీ సన్యాసినాయుడు

ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తాతారావు, సీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు



ఆలయంలో జెండా అవరోహణ చేస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ పవిత్రోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఈ నెల 16న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా గణపతి హోమం, దేవీ పూజ, దీపాలంకరణ, నక్షత్రహారతి తదితర కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు చేసి, హారతులిచ్చారు. అనంతరం జెండా అవరోహణతో కార్యక్రమాలు ముగిసినట్లు అయ్యప్ప దేవాలయ సమితి అధ్యక్షుడు ఎస్.ఎ.నాయుడు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌కు తక్షణ సాయం అందేలా సహకరించండి



పల్లాకు సమస్యలు వివరిస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: తీవ్ర గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్న స్టీల్‌ప్లాంట్‌కు తక్షణ సాయం అందేలా సహకరించాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌ను కోరారు. నాయకులు మంగళవారం పల్లాను కలిసి సమస్యలను వివరించారు. విద్యుత్ బిల్లులు వాయిదా పద్ధతిలో చెల్లించేందుకు అనుమతించేలా చూడాలన్నారు. మాంగనీసు, ఇసుక గనుల లీజు పొడిగించాలని, శాశ్వత పరిష్కారం కోసం సెయిల్‌లో విలీనం చేసేలా కృషి చేయాలని కోరారు. దీనిపై పల్లా స్పందిస్తూ ఈ విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. త్వరలో ఎంపీలతో ఉక్కు యాజమాన్యాన్ని కలుస్తామన్నారు. కార్యక్రమంలో సీ నాయకులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్, చంద్ర వెంకటేశ్వరరావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్టుకు పునరుజ్జీవం

కేజీహెచ్‌లో చెట్టుకూ చికిత్స



చెట్టుకు ఫంగల్ చికిత్స, న్యూట్రిషన్ ట్రీట్‌మెంట్ చేస్తున్న నిపుణులు

మహారాణిపేట: ఇటీవల కురిసిన వర్షాలకు కేజీహెచ్‌లో నేలకొరిగిన మహా వృక్షానికి మంగళవారం పునరుజ్జీవం కల్పించారు. ఆస్పత్రిలోని పార్కింగ్ ఆవరణలో గల 25 అడుగుల ఎత్తున్న బాదం చెట్టు వేళ్లతో సహా నేలకొరిగింది. అలా పడిన చెట్టును నరికేయకుండా తిరిగి యథాతథంగా నిలబెట్టేందుకు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చర్యలు చేపట్టారు. ఆ చెట్టులో కొన్ని కొమ్మలు తొలగించి, చెట్టు మానులో కూడా కొంత భాగాన్ని తొలగించి ఫంగల్ చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన క్లైమేట్ ఫ్రంట్ అనే సంస్థ సహకారం తీసుకున్నారు. జేసీబీ సహాయంతో చెట్టు పడిన ప్రాంతానికి 50 మీటర్ల దూరంలోని వేరే స్థలంలో తిరిగి నాటారు. వర్షాలకు పడిపోయిన చెట్టుకు ఫంగల్ చికిత్స, న్యూట్రిషన్ ట్రీట్‌మెంటు చేయటం వల్ల చెట్టు చిగురించి బతుకుందని క్లైమేట్ ఫ్రంట్ ప్రతినిధి భట్టాచార్య



తిరిగి నాటిన తర్వాత ఠీవిగా నిల్చున్న బాదం చెట్టు

తెలిపారు. గతంలో కాకినాడలో ఓఎస్‌టీఎస్ అనే సంస్థ ద్వారా అక్కడి వైద్య కళాశాలలో కూడా పడిపోయిన చెట్టును తిరిగి పునర్జీవింపజేసినట్లు కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. కేజీహెచ్ ఏఆర్ఎంవో డాక్టర్ దవళ భాస్కర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు లోకనాథ్, మేనేజర్ జె.ఎం.జవహర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పాల నడుమ కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిపిస్తున్న వేద పండితులు

అక్కిరెడ్డిపాలెం: భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా జరిపించారు. నాతయ్యపాలెం జాతీయ రహదారి పక్కనున్న శ్రీనివాస కల్యాణ మండపంలో శ్రీహరి సేవా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పి.రంగనాథాచార్యులు బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ వేదిక అధినేత టి.సుధాకర్ రెడ్డి, రామనిర్మల దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యానం ఆకట్టుకుంది. భక్తి సంగీత సేవా సంస్థ శృతిలయ అధ్యక్షుడు వి.ప్రభాకర్ బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అలరించాయి. విశాఖ నగరంతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన 2 వేల మంది శ్రీహరి సేవకులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సీహెచ్.వి.సత్యనారాయణ, ఎం.ఎస్. మాధవ్, కొణతాల రాజు, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం



మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మీనాయుడు

పెదగంట్యాడ: మాదకద్రవ్యాలతో అన్నీ అనర్థాలేనని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వై.లక్ష్మీనాయుడు అన్నారు. వాటికి అలవాటు పడి, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టవద్దని హితవు పలికారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లను దరి చేరనీయవద్దని, చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకున్నా, విక్రయించినా వెంటనే 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రమ్యశ్రీ , పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ స్టాక్ యార్డుల అమ్మకాన్ని విరమించుకోవాలి'

ఉక్కునగరం: దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్ స్టాక్ యార్డ్‌ల అమ్మకాలను విరమించుకోవాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్లాంట్ ప్రారంభ సమయంలో ఉక్కు ఉత్పత్తుల అమ్మకం, నిల్వ కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయి, ఢిల్లీ, పూణే తదితర ప్రధాన నగరాల్లో యార్డులను కొనుగోలు చేశారన్నారు. కీలకమైన ప్రాంతాల్లో స్టాక్ యార్డులు ఉండటం వల్ల టాటా, జిందాల్ వంటి సంస్థలతో పోటీ పడుతున్నామని చెప్పారు. స్టాక్ యార్డ్‌లను అమ్మడం అంటే ప్లాంట్ ఉత్పత్తులకు ఉన్న గిరాకీని కోల్పోవడమే అని, తద్వారా ఉన్న మార్కెట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడమే అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మార్కెటింగ్ యార్డ్‌లను రూ.476 కోట్లకు అమ్మాలనే నిర్ణయాన్ని స్టీల్ సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. తక్షణం ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు.

ఉక్కు పరిరక్షణకు కూటమి నాయకులు చొరవ చూపాలి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర మంత్రులు, ఎంపీలు, రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన స్పందించాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వై.మస్తానప్ప, ఎన్నేటి రమణ కోరారు. ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలోని నిరసన దీక్షా శిబిరంలో 1229వ రోజు వారు మాట్లాడారు. నూరు శాతం అమ్మేస్తాం లేదా మూసేస్తామని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ప్రకటించిందని, ఇందులో భాగంగానే ఉక్కును పరిపరి విధాలా ఇబ్బందులకు గురిచేస్తూ వచ్చిందని, నేడు ఉత్పత్తి క్షీణించి నష్టాల్లోకి నెట్టబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు సంకీర్ణ ప్రభుత్వంలోని టీడీపీ, జనసేన, రాష్ట్ర బీజేపీ నాయకులు చొరవ తీసుకుని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించడానికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వరసాల శ్రీనివాసరావు, నీలకంఠం, హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ఫీజులు నిలిపివేయాలని నిరసన



టోల్‌గేటు వద్ద నిరసన తెలుపుతున్న ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు

అగనంపూడి: అగనంపూడి టోల్‌ప్లాజాను తక్షణం ఎత్తివేసి, టోల్‌ఫీజులు వసూలు చేయడం నిలుపుదల చేయాలని 79, 85 వార్డులకు చెందిన టీడీపీ మిత్ర పక్షాల నాయకులు ఆందోళనకు దిగారు. 2019లో టోల్‌ప్లాజా తొలగించారని, అయితే సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించి స్టే తెచ్చుకుని టోల్‌గేటు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న టోల్‌గేటును తక్షణం తొలగించాల్సిందేనని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ కూటమి నాయకులు కర్రి దోంద్ర, మోటూరి వెంకటరమణ, గంతకోరు అప్పారావు, కత్తి తిలక్, సింగిడి సింహాచలం, ఈగల పోలినాయుడు, మాడిశ వెంకటరావు, గీత, నూకరాజు, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లు పునరుద్ధరించాలని ఆందోళన



పరవాడలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పరవాడ: విశాఖ-విజయవాడ మీదుగా నడిచే రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలని సీపీఎం నాయకురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. రైళ్ల రద్దుపై పరవాడలో సీపీఎం నాయకులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. రైళ్లను రద్దు చేయడం వల్ల పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, వలస కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. సామాన్య ప్రజలు గమ్య స్థానాలకు చేరుకోవడానికి నానా అవస్థలు ఎదుర్కొంటారన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని రైళ్లను పునరుద్ధరించి సామాన్యులకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని మాణిక్యం డిమాండ్ చేశారు. నాయకులు తులసిరాజు, నాయుడుబాబు, అప్పారావు, జగన్నాథరావు, శ్రీను పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై ఉదయం 9.30గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు.

- అప్పన్న స్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- స్వామి వారికి గరుడసేవ వైభవంగా జరిగింది. గరుడవాహనంపై అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తర పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.